


మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చుతున్న బీఆర్ఎస్ నాయకులు

## భయపడొద్దు అండగా ఉంటాం : కేటీఆర్



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల పక్షాన ప్రశ్నించడంలో తప్పులేదని భయపడొద్దు.. మీకు అండగా ఉంటామని వరద భాస్కర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో ధైర్యం చెప్పారు. సీఐ ఎందుకు కొడుతారని అడిగాడని.. అవసరమైతే హెచ్ఆర్‌సీకి కూడా వెళ్దామని, ఈ ఘటనపై ఎస్పీతో మాట్లాడుతామన్నారు. ఏదీ ఏమైనా పోలీసులు చేసింది తప్పేనని, అవసరమైతే బీసీ కమిషన్‌ను ఆశ్రయిద్దామని సూచించారు.



వన్‌టౌన్ పీఎస్ ఎదుట బైఠాయించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నేతలు

# బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- గులాబీ కార్యకర్తపై సీఐ దాడికి వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పీఎస్ ఎదుట నిరసన
- భాస్కర్‌కు నేతల పరామర్శ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30 : బీఆర్ఎస్ కార్యకర్త వరద భాస్కర్ ముదిరాజ్‌ను అకారణంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేటకు చెందిన వరద భాస్కర్ ముదిరాజ్‌ను సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ అప్పయ్య చితకబాదడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీసీ సంఘాల నేతలు పెద్ద ఎత్తున ఆయన ఇంటికి చేరుకొని పరామర్శించారు. అకారణంగా దాడి చేసిన తీరును నిరసిస్తూ అక్కడి నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. అక్కడికి చేరుకున్న సీఐతో మీరు తెలంగాణ కొడుకులు అని ఏ విధంగా సంబోధిస్తారని, ఆంధ్రా అధికారి అయిన మేము ఏనాడు మిమ్మల్ని అగౌరపర్చలేదని, కానీ మా తెలంగాణ వాదులపై వాడు, వీడు అని అసభ్య పదజాలంతో బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేసి ఎందుకు దాడి చేస్తున్నారని, ఎందుకు కేసులు నమోదు చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వన్‌టౌన్ సీఐ, రూరల్ సీఐ కూడా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని ఇవి సమాజానికి మంచి కాదని హెచ్చరించారు. తెలంగాణ పోరాటంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నాం, జైలుకు కూడా వెళ్లామని, ఇవి మాకు కొత్త కాదన్నారు. అయితే ఏ ప్రభుత్వం శాశ్వతంగా కాదన్న విషయం తెలుసుకొని పోలీసులు మసులుకోవాలని హితవు పలికారు. కార్యకర్తలు కూడా ఎన్ని కేసులు పెట్టినా బెదిరిపోవద్దని మీకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి మీ కోసం పోరాడుతుందని భరోసా ఇచ్చారు.



పాలమూరులో జరిగిన సంబురాల్లో గులాబీ శ్రేణులతో కలిసి పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్

# విద్యుత్ భారాన్ని మోపనియ్యం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలమూరు బీఆర్ఎస్ ఆఫీస్‌లో పటాకుల మోత

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 30 : విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపనీయమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా బీఆర్ఎస్ కట్టడి చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వినియోగదారులపై రూ.18వేల కోట్ల విద్యుత్ భారం పడకుండా, చార్జీలు పెంచకుండా పోరాడి అడ్డుకున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేతగాక కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజావ్యతిరేకతకు పాల్పడుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఏనాడు విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయని, వాటిని అమలు అడిగిన వారిపై ప్రభుత్వం కేసులు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటి వరకు రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని, రైతు చనిపోతే రైతు బీమాకు దిక్కులేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన పదినెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుందన్నారు. ఎస్టీ, ముదిరాజ్, మంగలి, చాకలి కులస్తులకు మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 50 ఎకరాల్లో జేఎన్‌టీయూ క్యాంపస్ తీసుకొచ్చామని వాటి పనులు మొదలవ్వలేదు.. పీఆర్‌ఎల్ఐ ప్రాజెక్టు మా ప్రభుత్వంలో చేసిన పనుల వరకే ఆగిపోయాయన్నారు. ప్రభుత్వ నూతన దవాఖాన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, బస్టాండ్ నుంచి దవాఖాన వరకు లిఫ్టుకు కోటి రూపాయలు, ఏకోపార్క్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని వాటిపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అదేవిధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లేదంటే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, శివరాజ్, దేవేందర్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, లక్ష్మయ్య, ఆంజనేయులు, అహ్మదుద్దీన్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

# మిన్నంటిన సంబురం

బీఆర్ఎస్ శ్రేణుల సంబురం మిన్నంటింది. ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంపై హర్షం వ్యక్తమైంది. గులాబీ పార్టీ నేతల పోరాటంతోనే ప్రజలకు కరెంట్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పటాకులు కాల్చారు.. ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ విజయమని నినదించారు. కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సంబురాలు జరుపుకొన్నారు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో బీఆర్ఎస్‌వీ నేత కుర్వ పల్లయ్య, మక్తల్, జడ్చర్లలో హర్షం వ్యక్తం చేశారు.



అయిజలో కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నేతలు

- విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం ఉపసంహరణపై హర్షం
- ఉమ్మడి జిల్లాలో పటాకులు కాల్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



జడ్చర్ల సిగ్నల్‌గడ్డ కూడలిలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నేడు వెలుగు జిలుగుల దీపావళి



# దీపం.. శోభాయమానం

- వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న ప్రమిదలు
- రూ.2 నుంచి రూ.150 వరకు ధర అందుబాటులో..
- బంతిపూలు, ప్రమిదల కొనుగోలుకు ఎగబడిన జనం
- ఆకాశాన్నంటిన పటాకుల ధరలు

దీపాలు సమృద్ధిగా వెలిగిన ఇంటిలో మహాలక్ష్మీ ప్రవేశిస్తుందని హిందూధర్మం చెబుతున్నది.. ఇంతటి ప్రాధాన్యత గల దీపం కార్తీకమాసంలో ఆలయాల్లో శోభాయమానంగా వెలుగుతుంటాయి.. వెండి వెన్నెలతో పోటీ పడుతూ దీపాలు వెలుగునిస్తాయి.. అమావాస్య చీకట్లను చీల్చి ఆకాశం వరకు కాంతిని విరజిమ్ముతాయి.. అంతటి దీపావళి పండుగ వచ్చిందంటే చాలు మహిళలు రకరకాల ప్రమిదలు కొనుగోళ్లు చేసి ఇండ్ల ముంగిట అందంగా అలంకరిస్తుంటారు.. మహిళల ఆలోచనలకు తగ్గట్టుగా ఈ ఏడాది మార్కెట్‌లో సరికొత్త ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి.

*- గద్వాలటౌన్/మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 30*

దీపావళి సందర్భంగా ఎంతటి నిరుపేద కుటుంబమైనా చిరుదీపాన్ని వెలిగించి మురిసిపోతారు. దీపావళి కంటే ముందు అశ్వయుజ బహుళ చతుర్దశి వస్తుంది. దీనినే నరక చతుర్దశిగా హైందవ ప్రజలు ఘనంగా జరుపుకొంటారు. దీపాలు వెలిగించి చెడుపై మంచి సాధించిన విజయంగా గొప్పగా నిర్వహించుకుంటారు. దీపాలను వెలిగించే ప్రమిదల ఎంపిక అంతా ఇంతా కాదు. ముఖ్యంగా దీపాలను మట్టి ప్రమిదల్లో వెలిగించడం సంప్రదాయం.




మహబూబ్‌నగర్‌లో పటాకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

**భిన్నమైన ఆకృతులు..**


మట్టి ప్రమిదల వినియోగం హైందవ సంస్కృతిలో ఒక భాగం. దీపాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తారు. మిగతా రోజుల్లో వివిధ రకాల ప్రమిదల్లో దీపాలను వెలిగించినా.. దీపావళికి మట్టి ప్రమిదలు ఉపయోగించడం శుభప్రదమని భావిస్తారు. దీంతో ఏటా భిన్నమైన ఆకృతుల్లో దీపాలు అమ్మకానికి వస్తున్నాయి. చిన్ని చిన్ని దీపాల నుంచి అడుగు దీపాల వరకు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. కొబ్బరికాయ ఆకారంలో దీపం, తులసికోట, పల్లెప డుములు నెత్తిన దీపం పెట్టుకున్నట్లు, శంఖం, తాబేలు, స్వస్తిక్, గోడలకు వేలాడదీసే ప్రమిదలు ఇలా చాలా ఉన్నాయి. రూ.2 నుంచి రూ.150 వరకు దీపాల ధరలు పలుకుతున్నాయి. గణపతి, లక్ష్మీ దేవీ ప్రతిమలు కూడా ఉన్నాయి. ప్రమిదల కొనుగోలుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

**పాలమూరులో సందడి**

పాలమూరు పట్టణంలోని అనేక చౌరస్తాలో మట్టి ప్రమిదలు, బంతి, చామంతి పూల విక్రయ కేంద్రాలు భారీగా వెలియడంతో కొనుగోలుదారులతో రహదారులన్నీ సందడిగా మారాయి. స్థానిక బాలుర కళాశాల మైదానంలో పటాకులు అమ్మకాల కోసం ప్రత్యేక షాపులను ఏర్పాటు చేశారు. పూలధరలతో పాటు స్వీట్లు, పటాకుల ధరలు కూడా భారీగా పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో రూ.500 తీసుకువస్తే సంచినిండా పటాకులు వచ్చేవని ఇప్పుడు రూ.వెయ్యి తీసుకుపోయినా అనుకున్న పటాకులు కొనలేకపోతున్నామంటున్నారు. కిలో రూ.600 చొప్పున పటాకులు విక్రయిస్తుండడం విశేషం.



వనపర్తిలో వెలిసిన పటాకుల దుకాణాలు



గద్వాలలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

# వైద్యశాఖలో ఉద్యోగాల పేరిట ఘరానామోసం

- ఇద్దరి వ్యక్తులతో రూ.3 లక్షలకు పైగా వసూలు
- యువరాజుపై కేసు నమోదు చేసిన పోలీసులు

గద్వాల అర్బన్, అక్టోబర్ 30 : వైద్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని వెంకంపేట గ్రామానికి చెందిన యువరాజు అనే వ్యక్తి ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి డబ్బులు తీసుకొని ఘరానా మోసానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం గద్వాల మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు వైద్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని అదే గ్రామానికి చెందిన యువరాజు వారి దగ్గర నుంచి విడుతల వారీగా రూ.3.08 లక్షలు తీసుకొని కాలయాపన చేస్తు వచ్చాడు. తాము ఇచ్చిన డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని బాధితులు యువరాజును అడగగా సమయం చెప్పు దాటవేసాడు. బాధితులు తాము మోసం పోయామని గ్రహించి గద్వాల రూరల్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. అయితే యువరాజుపై గతంలో కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన విషయంలో కేసులు ఉన్నాయి. యువరాజు మీద ఉన్న కేసులను పోలీసులతో మాట్లాడి మాఫీ చేయిస్తామని కొందరు పాత్రికేయులు బేరసారాలు చేసి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# కొంపముంచిన 'తడాఖా'

- బిజినేపల్లి మండలంలో కాపుకాయని పత్తి విత్తనాలు
- వెయ్యి ఎకరాల్లో సాగు
- దుకాణాల ఎదుట ఆందోళన



దుకాణాల ఎదుట ఆందోళన చేస్తున్న రైతన్నలు

బిజినేపల్లి, అక్టోబర్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో 'తడాఖా' రకం పత్తి విత్తనాలు కొంపముంచాయి. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన రైతులు బిజినేపల్లిలోని భాగ్యలక్ష్మి, శ్రీ సాయి ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వానకాలంలో ఈ రెండు దుకాణాల నుంచి తడాఖా రకం పత్తి విత్తనాలను కొనుగోలు చేసి దాదాపు వెయ్యి ఎకరాల్లో సాగు చేశామన్నారు. చెట్టుగా ఏపుగా పెరిగినా కాపు మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన కొన్ని కాయలు కూడా పత్తి తీసేందుకు రావడం లేదని వాపోయారు. సంబంధిత కంపెనీ సిబ్బంది, శాస్త్రవేత్తలు నెల కిందట గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి.. సాగుచేసినవి తడాఖా రకం విత్తనాలు కావని నిర్ధారించారన్నారు. కంపెనీ వారు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఏవో నీతి బుధవారం క్షేత్ర స్థాయికి వెళ్లి పంటలను పరిశీలించారు. సంబంధిత దుకాణాలను కూడా తనిఖీ చేసి సమాచారం సేకరించారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



నారాయణపేటలోని సత్యనారాయణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

# స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో నారాయణపేటలో విద్యార్థుల నిరసన

నారాయణపేట, అక్టోబర్ 30 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి సత్యనారాయణ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు చెప్పడం వల్ల విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఇన్ని రోజులుగా నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సతీశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇంతియాజ్, వినయ్‌కుమార్, వెంకటేశ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన విద్యార్థులు



మల్లాయిపల్లిలో బస్సు కోసం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

పాన్‌గల్, అక్టోబర్ 30 : బస్సులను విద్యాసంస్థల సమయానికనుగుణంగా నడపాలంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం మల్లాయిపల్లి గ్రామంలో విద్యార్థులు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కొండల్, రవీందర్‌రెడ్డి, రవి మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేంద్రం నుంచి మల్లాయిపల్లి మీదుగా పెబ్బేరు వరకు ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించడం లేదన్నారు. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులను బస్సులో ఎక్కించుకోకుండా ముందుకు వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి దుస్థితి నెలకొన్నదన్నారు. కేసీఆర్ పాలనలో బస్సులు సక్రమంగా నడిచేవని, ప్రస్తుతం అడిగే దిక్కు లేకపోవడంతో పరిస్థితి ఇలా మారిందన్నారు. ఆర్టీసీ అధికారులు పద్ధతి మార్చుకోకుంటే విద్యార్థుల సమక్షంలో డిపోను ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ సస్పెన్షన్

వనపర్తి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభువినయ్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభువినయ్ విధులకు హాజరుకాకుండా ఇంటి నుంచే ఆఫీసు వ్యవహారాలను కొనసాగించాడని, సర్వీస్ రిజిస్టర్‌లో పుట్టిన తేదీ మార్పు, సీనియార్టీ లిస్టులో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్ గౌడ్ వనపర్తి కలెక్టర్ తోపాటు రాష్ట్ర ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం అధికారులు వినయ్‌ప్రభును సస్పెండ్ చేశారు.

## విద్యార్థినిపై ఇన్‌చార్జి హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు : కేసు నమోదు

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 30 : డిగ్రీ విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంపై కేసు నమోదు చేసిన ఘటన అచ్చంపేటలో చోటు చేసుకున్నది. ఎస్సై రమేశ్ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సిద్ధార్థ మహదేవ్ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే, ఆయన అచ్చంపేట పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి వెనకాల ఉన్న డిగ్రీ విద్యార్థిని ఇంట్లోకి అనుమతి లేకుండా చొరబడి.. సెల్‌ఫోన్‌ను చేతికందించి టచ్‌లో ఉండాలంటూ అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు యువతి కుటుంబసభ్యులకు విషయం తెలపడంతో అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సిద్ధార్థ మహదేవ్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెక్సువల్ హరాష్‌మెంట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.